# సెట్టుకో

సెట్టుకో అన్న మాట ఈ కథ చదువుతున్న వాళ్ళలో ఎంతమందికి తెలుస్తుందో నాకు తెలియదు. ఈ మాటని ఈమధ్యకాలంలో నేను విన్లేదు. ఇదేకాదు. ఇటువంటి మాటల్ని నేను విని పది సంవత్సరాలు దాటిపోతోంది.

నేను పుట్టిందీ, పెరిగిందీ గోదావరి జిల్లాలకి దూరంగానే కానీ-ఆ జిల్లాల తెలుగుతో సంబంధం, సాన్నిహిత్యం కాస్తంత ఎక్కువే.

నా చిన్నప్పుడు వేసవి సెలవులకి మేం తప్పని సరిగా మా మామ్మగారి ఊరు వెళ్తుండేవాళ్ళం. మాతోపాటే మా బాబాయ్‌వాళ్ళ కుటుంబాలూ, అత్తయ్యల కుటుంబాలూ వచ్చేవి.

పెద్దవాళ్ళకి ఎలా వుండేదో తెలియదుకానీ మా చిన్నపిల్లలకి మాత్రం చాలా హాయిగా వుండేది. విశాలమైన అరుగులతోవున్న డాబాఇంటివెనకాల పెద్ద దొడ్డి వుండేది. అందులో ఆడుకుంటూ రెండునెలలూ ఆనందంగా గడిపేసేవాళ్ళం.


అక్కడున్న ఆ రెండునెలలూ వినిపించేవి నాకు సెట్టుకోలాంటి మాటలు.

సెట్టుకో అంటే ఉంచుకో అని అర్థం. ఐతే అది ఉత్తి ఉంచుకో కాదు. తరువాత ఉపయోగిస్తుంది ఉంచుకో అన్న ధ్వని వుంది అందులో.

ఇంకా చెప్పాలంటే నువ్వు ఉంచుకో- నువ్వే వుంచుకో అన్న ధ్వని కూడా వుంది. అలాంటిదే ఇంకోమాట కూడా వుంది. 'అట్టేపెట్టుకో' అని. ఇంతకీ ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే- ఈ కథ రాద్దామని అనుకున్నప్పట్నుంచీ నాకు ఈ మాటే గుర్తుకువస్తోంది. దాంతోపాటే మా మామ్మా,

అనామకుడు





**• ఎలా నిరీక్షించాలో తెలియడం విజయ సాధనకు గొప్ప రహస్యం.**

ఆవిడ 'సెట్టుకో' అని అనడం గుర్తొస్తోంది.

అసలీ కథ రాయడానికి కారణం నిన్న జరిగిన చిన్న సంఘటన. సంఘటన ఏం పెద్దదికాదు. నిజానికి అది ఒక సంఘటన కూడా కాదు. ప్రతిరోజూ మామూలుగా జరిగే విషయమే. ముందు ఆ సంఘటనని మీ ముందుంచి, ఆ తర్వాత మా మామ్మ ఆ మాటల్ని ఎప్పుడు అందీ, ఎందుకు అందీ చెప్తాను. అప్పుడు ఈ కథకి ఈ పేరు ఎంత సబబో మీరే నిర్ణయించుకోవచ్చు.

రోజూలానే శ్రీధర్ (నాకెందుకో మావారు, మా ఆయన అనడం రాదు) ఆఫీస్‌కి వెళ్ళిపోయాకే లేచింది సోనూ. దానికి మొన్ననే నాలుగేళ్ళొచ్చాయి. ఓ కేజీ అయ్యింది. రెండో కేజీకి వెళ్తుంది. రాత్రి పన్నెండు దాటితే కానీ పడుకోదు. పొద్దున్న తొమ్మిదైతే కానీ లేవదు. ఇంక పగలు అసలు పడుకోదు. ఇప్పుడే కాదు. పుట్టినప్పట్నుంచీ అంతే.

అది ఎప్పుడు లేస్తుందా అని ఎదురుచూస్తూ నేను దానిదగ్గరే ఉంటానేమో- అది ఎప్పుడు నిద్ర లేచినా- దానికి వెంటనే కనిపిస్తాను.

అది నిద్రలేవడమే తమాషాగా వుంటుంది. అంతవరకూ నిద్రపోతూనే ఉంటుంది. హఠాత్తుగా కళ్ళుతెరుస్తుంది. ఆ కళ్ళలో నిద్రమత్తు ఉండదు. అలా లేవగానే పరుగెత్తుకుంటూ నా దగ్గరకి వచ్చేస్తుంది. అసలు బద్ధకమే ఉండదు.

వచ్చి ఏవో కబుర్లు మొదలెడుతుంది. అలానే నిన్నకూడా నా దగ్గరకి వస్తూనే "సాయంత్రం డింగ్ డింగ్ మావయ్య వస్తాడా?" అని అడిగింది.

"ఏమో నాకేం తెలుసు? నీకేదన్నా చెప్పాడా?" అని అడిగాను నేను.

"నాన్న చెప్పాడు- మావయ్య సాయంత్రం వస్తాడని-" అని అంది సోను.

డింగ్‌డింగ్ మావయ్యంటే నా కజిన్. వాడు అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూంటాడు. వాడిదగ్గర సోనూకి బాగా చనువు. వాడు దాని చిన్నప్పుడు డింగ్ డింగ్ అని ఆడించేవాడు. దాంతో వాడిపేరే డింగ్‌డింగ్ మావయ్య అయిపోయింది.

"ఏమో నాకేం గుర్తులేదు" అని నేనంటోంటే- "అసలు నీకేం గుర్తుండదు" అని అంటూ బాత్‌రూంవైపు నడవసాగింది సోనూ.

"అది సర్లేకానీ- ఇంతకీ నీకు డింగ్‌డింగ్ మావయ్య ఎందుకు-ఏదన్నా తెస్తానని అన్నాడా?" అని అడిగాను నేను.

"కాదు- నా దగ్గర బే బ్లేడ్‌లు రెండున్నాయి కదా-" అని అది ఇంకా ఏదో చెప్పబోతుండగానే మధ్యలో దూరి "నీ దగ్గర రెండెక్కడున్నాయి- ఒకటే కదా?" అని నేనన్నాను.

ముందుగా "నీకస్సలు తెలియదు" అని తల కొట్టుకుంది. ఆ తర్వాత రెండు వేళ్ళు చూపిస్తూ "రెండు-రెండున్నాయి" అంది.

అదీ అయ్యాక- "ఒకటి నాన్న కొన్నది. ఒకటి బోర్నవిటా కొన్నప్పుడు వచ్చింది" అంది.

అది అలా అభినయిస్తూ మాట్లాడేస్తోంటే- నాకెంతో ముచ్చటగా అనిపిస్తుంది. దాన్నలా చూస్తూ ఎంతసేపన్నా ఉండిపోవచ్చుననిపిస్తుంది. అంత అమాయకత్వాన్ని చూస్తూ వుండడం కన్న ఆనందం ఇంకెక్కడా దొరకదనిపిస్తుంది.


"అది సరే-దానికీ డింగ్‌డింగ్ మావయ్యకీ-" అని నేను మొదలెట్టేలోగానే- "పోయినసారి మావయ్య మనింటికి వచ్చినప్పుడు నా బే బ్లేడ్ ఇవ్వమన్నాడు. అప్పుడు నా దగ్గర ఒక్కటే బే బ్లేడ్ వుందికదా- నాన్న కొన్నది. అందుకే ఇవ్వలేదు. ఇప్పుడు ఇంకోటి వచ్చిందికదా. ఒకటి మావయ్యకి ఇస్తాను" అని అంది సోను.

"మావయ్యేం చేసుకుంటాడు- ఊరికే అడిగుంటాడు" అని నేనంటుండగానే-

"మావయ్య అడిగాడు-నేను ఇస్తాను-అంతే" అంటూ బాత్‌రూంలోకి దూరిపోయింది.

అలా అది గుర్తుపెట్టుకుని ఇస్తానని అన్నందుకు నాకు సంతోషం వేసింది. సరిగ్గా ఆ సమయానికే

**తృప్తిగలవారు సర్వవేళలా సుఖసంతోషాలతో ఉంటారు.**




ఫోన్ మోగింది. కాలర్ ఐడీ స్క్రీన్‌మీద శ్రీధర్‌పేరు చూసి స్పీకర్ ఆన్ చేశాను.

"కళ్యాణీ- మా బాస్ ఓ వారంరోజులు అఫీషియల్ పనిమీద ఇప్పుడే జపాన్ వెళ్ళాడు" శ్రీధర్ గొంతు చాలా ఉత్సాహంగా వినిపించింది.

"బాస్ వారంరోజులు లేకపోయేసరికి జాలీగా వుందా?" అని నేనంటోంటే- "అదేంకాదు. బాస్ వెళ్తూవెళ్తూ నన్ను పిలిచాడు. ఇంకెవరినీ కాదు. నన్ను మాత్రమే-" అన్నాడు శ్రీధర్.

ఆఫీసుల్లో ఇదో గొప్ప విషయం.

బాస్ ఎవరిని విడిగా పిలిస్తే వాళ్ళకి సంతోషం. తక్కినవాళ్ళకి బాధ. నేను ఆఫీసుల్లో పనిచెయ్యలేదు కానీ శ్రీధర్ దగ్గర వింటూ వింటూ ఆఫీసుల గురించి చాలా నేర్చుకున్నాను.

"ఊ-మిమ్మల్నే పిలిచి- ఏదన్నా ఇంక్రిమెంట్ ఇస్తానన్నాడా? లేకుంటే ప్రొమోషనే-" అన్న నా మాటలకి అడ్డువస్తూ-

"అంతకన్నా ముఖ్యమైంది. సౌదీలో మా కంపెనీదే ఒక బ్రాంచ్ వుంది. దాని మేనేజర్ పోస్ట్ ఖాళీ వుంది. దానికి అర్హతగలవాళ్ళని అప్లయ్ చేసుకోమని ఓ ఉత్తరం మా ఆఫీస్‌కి వచ్చింది.

అది వచ్చి వారం అయింది కానీ మా బాస్ దానిగురించి పట్టించుకోలేదు. ఈరోజు పొద్దున్న వెళ్ళడానికి ముందది గుర్తొచ్చింది లాగుంది. నన్ను పిలిచి అప్లై చెయ్యమన్నాడు?"

"రియల్లీ- మరి అప్లై చేసేశారా?"

"ఆ-అప్లై చెయ్యడానికి ఈరోజే ఆఖరిరోజు. ఈ-మెయిల్లో పంపించేస్తున్నాను. ఎవరికీ తెలియకుండా-" శ్రీధర్ మాటలు హఠాత్తుగా- నెమ్మదిగా రహస్యంగా అంటున్నట్లుగా వినిపించాయి.

"ఏం-ఇంకెవరికన్నా తెలిస్తే ఏముంది? మీ బాస్ మిమ్మల్నేకదా అప్లై చెయ్యమన్నది?"

"అలాగనేం అన్లేదు. తను వెళ్ళిపోతూ హడావిడిగా ఈ ఉత్తరాన్ని చూశాడు. చూసి మన ఆఫీస్‌లో ఎవరెవరికి మేనేజర్ అయ్యేందుకు అర్హత వుందో వాళ్ళందరూ అప్లై చెయ్యొచ్చు. నీకుందిగా నువ్వు చెయ్యి. ఇంకెవరికైనా అర్హత వుందంటే వాళ్ళకి చెప్పు అని అన్నాడు. అంటే-"

**• గొప్ప గుణాలుంటే సరిపోదు, వాటిని వినియోగించుకోగలగాలి.**
**• ఎవరి జీవితంలోనూ ప్రాముఖ్యం లేని రోజు అనేది వుండదు.**

"మీకు చెప్పాడు కదా- మీరు చెయ్యండి" అని అన్నాను నేను. "నేను చేస్తాను సరే- ఇంకా అర్హత వున్నవాళ్ళు అయిదారుగురుమంది ఉన్నారు. వాళ్ళకి చెప్పాలా వద్దా అని"

"మీ బాస్ ఎవరికైనా చెప్పమని చెప్పాడా?"

"ఫలానా వాళ్ళకని చెప్పలేదు కానీ-"

"భాస్కర్ పేరో శేఖర్ పేరో చెప్పాడా?"

"లేదు. అందుకే నేనూ ఎవరికీ చెప్పలేదు. నేను చేస్తున్నది కరెక్టే కదా?" ఆ గొంతులో తను చేస్తున్నది కరెక్టేనా అన్న ప్రశ్నలేదు. కరెక్టేనని చెప్పు అన్న ప్రార్థన వుంది.

"సెంట్ పెర్సెంట్ కరెక్ట్. ఒకపని చెయ్యి. అప్లై చేసి ఇంటికొచ్చెయ్. అక్కడుంటే అనవసరమైన ఆలోచనలు వస్తాయి" అన్నాను.

"అంతేనంటావా?" అని శ్రీధర్ అంటూండగా-

"అంతే" అని ఫోన్ ఆఫ్‌చేసేశాను నేను.

బాత్‌రూంలోంచి బయటకి వచ్చిన సోనూ మా మాటల్ని వింటూనేవుంది. మామూలుగా అయితే మధ్యలో వాళ్ళనాన్నతో ఏదో ఒకటి అరుస్తూ మాట్లాడేది. ఎందుకో ఏమీ మాట్లాడలేదు. నాకు ఆశ్చర్యంగా అనిపించింది.

"బే బ్లేడ్లు రెండింట్లో ఏది మావయ్యకి ఇవ్వను?" అని అడిగింది.

"నీ ఇష్టం. నీకేది కావల్సొస్తే అది ఉంచుకో. నాన్న కొన్నది బావుంది. మంచిది. రెండోదే ఇయ్యి" అన్నాను నేను.

"నాకు రెండూ బావున్నాయి"

"అయితే రెండూ ఉంచేసుకో"

"మరి మావయ్య అడిగాడు కదా- ఇవ్వకపోయినా ఫరవాలేదా?"

"ఏం ఫరవాలేదు"

"ఇవ్వనా-వద్దా?" సందేహంగా అంది.

ఇందాక ఇచ్చేస్తానని అన్న పిల్ల ఇప్పుడు ఇవ్వనా వద్దా అని ఎందుకు ఆలోచిస్తోందో అర్థంకాలేదు. దానిగురించి నేనేదో అనేలోగా కాలింగ్‌బెల్ మోగింది. వెళ్ళి తీశాను. పక్కింటి సరోజ. ఇంటర్ పరీక్షలు రాసింది. రేపో ఎల్లుండో ఎంసెట్ పరీక్ష రాస్తుంది. ఆ హడావిడిలో ఎందుకొచ్చిందా అని నేను అనుకుంటుండగానే-

"ఆంటీ- ఒక్క అయిదు నిమిషాలు కూర్చుని వెళ్ళిపోతానేం" అని అంది.

ఏమిటన్నట్లు చూశాను.

"నా ఫ్రెండ్ సుజాత వస్తోంది. నేనింట్లో వుంటే ప్రోబ్లం" అంది సరోజ.

"ఏం ప్రోబ్లం?" అన్నాను నేను.

"నీకు చెప్తే ఫరవాలేదులే. నాకు ఎంసెట్ పరీక్షకి వచ్చే కొన్ని క్వశ్చన్స్ దొరికాయి. అది వచ్చి అడిగితే దానికి కూడా చెప్పాలి.అందుకే ఇంట్లో వుండకుండా వచ్చేశాను. నేను లేనని చెప్పి అమ్మ దాన్ని పంపించేసిన తర్వాత నేనింటికి వెళ్తాను"

"ఎంసెట్ క్వశ్చన్స్ దొరుకుతాయా?"

"ఎలాగో దొరికాయి"

"నీకు దొరికినట్లు ఆ పిల్లకెలా తెలిసింది?"

"నేనే చెప్పాను"

"ఆ పిల్లకి క్వశ్చన్స్ చెప్పకూడదనుకుని అనుకుంటే ముందు దొరికినట్లు ఎందుకుచెప్పావ్?"

"అప్పుడు చెపుదామనుకునే అనుకున్నాను. తర్వాత అమ్మ చెప్పింది. అందరికీ చెప్తే నాకే నష్టమని. అందుకే ఎవ్వరికీ చెప్పద్దంది"

"ఓసి వెర్రిపిల్లా- ముందే ఆమాత్రం ఆలోచించలేకపోయావా?" అన్నాను నేను.

"ఏమో- ఫ్రెండ్ కదాని-" అని సరోజ అనేలోగా, పక్కింటి నుండి వాళ్ళమ్మగారొచ్చి-


"ఏం తెలియదు. ఎలా బతుకుతుందో ఏమో- ఎంసెట్ అంటే కాంపిటీషన్ పరీక్ష కదా- అందరికీ క్వశ్చన్స్ చెప్పేస్తే ఎలా అన్న కనీస ఇంగితంకూడా లేదు" అని నాతో అంది.

**కాలాన్ని సద్వినియోగం చేసుకునేవారు దేన్నీ వదలరు.**

# 'కుడి ఎడమైతే?' ఫలితం

ఆగష్టు 2007 సంచికలోని 'కుడి ఎడమైతే?' క్విజ్‌కి వచ్చిన సమాధానాల్లో ఆల్ కరెక్టుగా గుర్తించిన వారిలో- 1. పి.అభినయ్‌శ్రీరామ్ (హన్మకొండ), 2. బి.హిమబిందు(ధవళేశ్వరం)లను లాటరీ ద్వారా విజేతలుగా నిర్ణయించి, ఒక్కొక్కరికి రూ.116/-చొప్పున నగదు బహుమతిని పంపడం జరిగింది.

కరెక్టుగా *గుర్తించిన* సమాధానం :




"సుజాత వెళ్ళిందికానీ ఎన్నిప్రశ్నలడిగింది నీ గురించి. ఏదోచెప్పి పంపించేందుకు ఎంత కష్టం అయిందో-ఇంక పద చదువుకుందువు గానీ" అని సరోజని తీసుకువెళ్ళిపోయింది సరోజ అమ్మ.

సోనూ అంతా వింటూనేవుంది.ఎప్పుడూ దాంతో ఏదో ఒకటి మాట్లాడే సరోజ ఇవాళ దాన్ని పలకరించకపోవడం దానికి నచ్చలేదేమో- అదోలా కూర్చుంది.

"ఏంటమ్మా-" అని నేనడిగాను.

"మావయ్యకి బే బ్లేడ్ ఇవ్వనా వద్దా?" అని అడిగింది. దానికి మనస్సంతా బే బ్లేడ్‌మీదే వుంది.

"ఏం- ఎందుకలా అడుగుతున్నావ్?"

"నేనివ్వను. నేనే రెండూ వుంచేసుకుంటా. బే బ్లేడ్ దాచేస్తాను" అని లోపలికి వెళ్ళింది.

నేను విస్తుపోయాను. ఎక్కడ మొదలై ఎక్కడ తేలింది. మావయ్యకి ఒకటి ఇచ్చేస్తానని మొదలెట్టి- ఇవ్వనా వద్దా అని అనుకుని- ఇవ్వనని తేల్చేసింది.

ఎందుకిలా అయిందని నేననుకుంటుండగా- నాకు శ్రీధర్ ఫోన్‌చెయ్యడం, సరోజ వచ్చి మాట్లాడ్డం గుర్తొచ్చాయి. దాంతోపాటే నా చిన్నప్పుడు మా మామ్మ 'సెట్టుకో' అనడం గుర్తొచ్చింది. ఆ సంఘటనగురించి చెప్పి ఈ కథ ముగించేస్తాను.

నా వయస్సప్పుడు నాలుగేళ్ళయ్యుంటుంది- ఇప్పుడు సోనూ వయస్సంతే.

మామ్మావాళ్ళ ఊళ్ళో వేసవి సెలవులు గడిపేసి మా ఊరు వెనక్కి వెళ్ళిపోయే రోజది. మా అమ్మ- తన దగ్గరున్న వెండిపట్టాల జతల్లో ఒకదాన్ని మా బాబాయ్ కూతురికి ఇద్దామని అనుకున్నట్లుంది. ఆ మాటే ఇంకెవ్వరూ లేనప్పుడు మామ్మతో అంది.

"నీది నువ్వు సెట్టుకో-" అంది మామ్మ.

"నా దగ్గర రెండున్నాయి కదా" అని అమ్మ ఏదో అనేలోగానే, "దానికి వాళ్ళ నాన్న చేయిస్తాడులే నీ రెండు జతలూ నువ్వే సెట్టుకో" అంది మామ్మ.

ఆరోజు మామ్మ అన్నమాటలు ఈరోజు నాకు గుర్తొచ్చినట్లే- ఈరోజు నేనూ, శ్రీధర్, సరోజ అన్న మాటలూ ఏదో ఒకరోజు సోనూకి గుర్తొస్తాయేమో- అని అనిపిస్తోంది నాకు.